ప్రజాశక్తి

శుక్రవారం 31 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ముంచేసింది !

◆ రాంబిల్లి మండలం రజాల అగ్రహారం వద్ద శారద నదికి గండి
◆ వందల ఎకరాల్లో పంటలకు భారీ నష్టం ◆ ఆక్వా రైతులకు కోలుకోలేని దెబ్బ
◆ జలదిగ్బంధనంలో నాలుగు గ్రామాలు ◆ భయాందోళనలో ప్రజలు



రజాల వద్ద మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి - అనకాపల్లి/రాంబిల్లి

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి, రజాల అగ్రహారం ప్రాంతంలో శారదా నది గట్టుకు గురువారం గండి పడటంతో వరద నీరు ఏడు గ్రామాల పరిధిలోని పొలాలను ముంచేసింది. వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. చేపలు, రొయ్యల చెరువుల వారికీ కోలుకోలేని దెబ్బ తగిలింది. వైలోవ, రజాల, చిన్న కలవలపల్లి, పెదకలవలపల్లి గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. రోజంతా భయాందోళనల నడుమ ఆయా గ్రామాల ప్రజలు గడిపారు. అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలకు పూనుకుంది.



పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అసలేం జరిగింది ?

దేవరాపల్లి మండలం రైవాడ జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి జలాశయంలోకి 10,000 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. దీంతో జలాశయం నాలుగు గేట్లు ఎత్తి దిగువ శారదా నదిలోకి 9,000 క్యూసెక్కుల వరద నీటిని విడిచి పెడుతున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 114 మీటర్లకాగా, ప్రస్తుతం 112.25 మీటర్ల వద్ద ఉందని డిఇఇ సత్యంనాయుడు తెలిపారు. శారద నది ప్రవాహానికి చుట్టుపక్కల కాలువల్లోని నీరు తోడవడంతో రజాల అగ్రహారం వద్ద శారదా నది గట్టుకు సుమారు 40 మీటర్ల పొడవైన భారీ గండి పడింది. దీంతో తొలుత వైలోవ సమీప గ్రామాలు ముంపునకు గురయ్యాయి. క్రమేపీ మిగతా మూడు గ్రామాలు జలదిగ్బంధంలోకి వెళ్లాయి. రెండు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. శారదా నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. మరోపక్క మునగపాక మండలం గణపర్తి వద్ద శారదా నదికి గండి పడటంతో ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటలు నీటమునిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు.

ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

రాంబిల్లి మండలంలోని శారద నది వరద ప్రభావానికి గురైన గ్రామాలలో స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ విజయకృష్ణన్ సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా రాంబిల్లి మండలం మిగతా 2లో..



ఒప్పంద పత్రాలతో పోర్టు అధికారులు

రూ.39,216 కోట్ల ఒప్పందాలు

ఇండియా మారిటైమ్ వీక్‌లో విశాఖ పోర్టు అధికారుల సంతకాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ముంబయి వేదికగా ఈ నెల 27 నుండి 31 వరకు జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్ - 2025లో విశాఖ పోర్టు రూ.39,216 కోట్ల విలువైన పలు కీలక ఒప్పందాలను చేసుకుంది. భారతదేశ సముద్ర రంగ సామర్థ్యాన్ని, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రతిబింబించే ప్రధాన వేదికగా ఈ మారిటైమ్ వీక్‌ను పిలుస్తున్నారు. వందకుపైగా దేశాల ప్రతినిధులు అందులో పాల్గొంటున్నారు. పోర్టులలో మౌలిక సదుపాయాలు, షిప్ బిల్డింగ్, అంతర్గత జలమార్గాలు, గ్రీన్ షిప్పింగ్ వంటి విభాగాల్లో భారత్‌ను మిగతా 2లో..

ఫార్మా పరిశ్రమలకు వెంటనే విద్యుత్ సరఫరా చేయాలి

▶ వార్త 6లో..

నేటి నుంచి రేడియాలజిస్టుల రాష్ట్ర మహాసభ

▶ వార్త 2లో..

పల్లిగెడ్డలో విద్యార్థిని గల్లంతు

▶ వార్త 3లో..

ఐపిఎస్ అధికారుల బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రేంజ్ పరిధిలో పలువురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ డిజిపి హరీష్ కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న 2020 బ్యాచ్‌కు చెందిన జగదీశ్ అడహళ్లిని విశాఖపట్నం సిటీ లా అండ్ ఆర్డర్ డిసిపి - 1గా బదిలీ చేశారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఎఎస్‌పిగా పనిచేస్తున్న 2020 ఐపిఎస్ బ్యాచ్‌కి చెందిన పంకజ్ కుమార్ మీనాను అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్‌పిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

మొంథా తుపాను వల్ల నష్టపోయిన ప్రజానీకం వివరాలను గ్రామాల వారీగా సేకరించి శాస్త్రీయమైన పద్ధతిలో నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పార్టీ అనకాపల్లి జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పునరావాస కేంద్రాలను మౌలిక వసతులు లేకుండా ఏర్పాటు చేశారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని తెలిపారు. భవిష్యత్తులోనైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తుపాను వల్ల పంట భూములకు, వృత్తిదారులు, దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కేవలం పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికే పప్పు, బియ్యం, పంచదార, నూనె, దుంపలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇది సరికాదని అన్నారు. నష్టపోయిన ప్రజానీకానికంతటికీ సహాయ, సహకారాలు, నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు కాకిలెక్కలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంటనష్టం అంచనా వేయాలని, ఇళ్లు కూలిపోయిన వారికి మరలా ఇళు నిర్మించుకొనేందుకు సరిపడా సహాయం అందించాలని, పంటలు నీటమునిగిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో డ్రెయినేజీలు, కాలువలు పూడికపోయాయని, యుద్ధ ప్రాతిపధికన పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. అంటు వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ముంచేసింది !

కుమ్మరాపల్లి, రజాల ప్రాంతంలో శారదా నదికి గట్టు తెగిన ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. వారి వెంట అనకాపల్లి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ శ్రీనివాస్, రాంబిల్లి ఎంపిడిఒ, తహసీల్దార్లు జయ మాధవి, శ్రీనివాసరావు, నీటి పారుదల శాఖ అధికారులు ఉన్నారు.

ప్రజలకు ఆదుకోవాలి : సిఐటియు, రైతు సంఘం

శారదా నది గట్టుకు గండిపడి వేలాది ఎకరాలు వరి పంట పూర్తిగా మునిగిపోయిన నేపథ్యంలో బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు సమ్మెట్ల రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా ఎన్ఎఒబి నిర్మాణం జరగడంతో శారదా నది వాటర్ సముద్రంలోకి యధావిధిగా పోవడానికి వీలుకావడం లేదన్నారు. దీంతో ప్రవాహ ఉధృతి పెరిగి గండ్లుకు ఆస్కారం ఏర్పడుతోందన్నారు.



రాజాంలో చెరువుకు పడ్డ గండితో రోడ్డుపైకి చేరిన నీరు



లింగంపేటలో నీట మునిగిన వరి పంట

చెరువులకు గండ్లు

చీడికాడ మండలం చిన్నగోగాడలో చెరువు కోతకు గురై పొలాలు నీట మునిగాయి. రావికమతం మండలం నేరేడుబంధ, పిత్రిగుడ, నీల్లబంద, రోలుగుంట మండలంలోని అర్త పంచాయతీ గ్రామాల్లో పొలాలు, మాడుగుల మండలం పొంగలిపాక, పి.శివరాంపురం, గొలుగొండ మండలం లింగంపేట, గైరంపేటల్లో వరి పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. బుచ్చయ్యపేట మండలం రాజాంలో అప్పలనాయుడు చెరువుకు గండిపడటంతో రోడ్డుపైకి నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దేరు జలాశయం నుండి వరద నీటి విడుదలతో వడ్డాది వద్ద వందలాది ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. వరద నీటితో యలమంచిలి నుంచి అచ్యుతాపురం మీదుగా గాజువాక వెళ్లే బైపాస్ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి.

తుపాను బాధితులను ఆదుకోవాలి

పనులు చేపట్టాలన్నారు. కొట్టుకుపోయిన రోడ్లు, కాలువలు, కూలిన బ్రిడ్జిలకు అంచనాలు వేసి నిధులు కేటాయించి వెంటనే పనులు చేపట్టాలన్నారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులుకు పరిహారం అందించాలన్నారు. అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వర్షాలు వచ్చిన ప్రతిసారీ ముంపునకు గురౌతోందని, ఆర్‌టిసి, మున్సిపల్ కార్పొరేషన్ మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందని తెలిపారు. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారన్నారు. శారదా, వరహా పరివాహక ప్రాంతాల్లో నదులకు ఇరువైపులా పంటలు, గట్టులు పూర్తిగా కొట్టుకుపోవడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తుపాను ప్రభావాల వల్ల చాలా ప్రాంతాల్లో కాలువలకు గండ్లు పడుతున్నాయని, శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపడితేనే ప్రయోజనకరమని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

రూ.39,216 కోట్ల ఒప్పందాలు

అంతర్జాతీయ నౌకాయాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్చలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి దుగరాజపట్నంలో మేజర్ పోర్టు కమ్ షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు కోసం రూ.29,662 కోట్ల విలువైన ఒప్పంద పత్రాలను మార్చుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాగే మెకాన్ ఇండియాతో విశాఖ పోర్టు రూ.3 వేల కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అందులో భాగంగా ఆధునిక స్టాక్‌యార్డులు రైల్వే సైడింగ్స్ అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. ఎన్‌బిసిసితో రూ.500 కోట్ల విలువైన ఒప్పందం ద్వారా హార్బర్ పార్క్‌లో ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుడతారు. హడ్కోతో రూ.487.38 కోట్ల విలువైన మరో ఒప్పందం ద్వారా కార్గో బర్త్‌ల యాంత్రీకరణ, ఆధునీకరణ, పర్యావరణహిత సాంకేతికతల అమలుకు అడుగులు పడనున్నాయి. పోర్టు ప్రాంగణంలో అంతర్గత ఫ్లైఓవర్లు నిర్మించడానికి రైల్ వికాస్ లిమిటెడ్‌తో రూ.535 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

పెన్షనర్ల పే స్లిప్పులను సవరించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : పెన్షనర్ల పేస్లిప్‌లలో లోపాలను సరిచేయాలని, ఎపి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ ఇంజనీరింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు. కూర్మారావు కోరారు. ప్రభుత్వ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్‌కు అసోసియేషన్ తరపున వినతిపత్రం అందజేశామన్నారు. 37.31 శాతానికి డిఎ అలవెన్స్ రేటు సక్రమంగా అమలు చేయడంపై హర్షం వెలిబుచ్చారు. ఆర్థిక సంవత్సరంలో మొత్తం చెల్లింపు వివరాలను సూచించే వైటిడి కాలంను పేస్లిప్పుల్లో తిరిగి చేర్చాలన్నారు. పెన్షనర్ల ఆర్థిక లెక్కలు, వ్యక్తిగత రికార్డులు, ఆదాయపు పన్ను రిటర్న్‌లకు ఇది అత్యవసరమన్నారు. వయస్సు ఆధారంగా అదనపు పెన్షన్ ఆటోమేటిక్‌గా చేర్చేలా అన్ని ట్రెజరీలకు తగిన సూచనలు జారీ చేయాలన్నారు.డిఎ బకాయిల వివరాలు పే స్లిప్‌లో చేర్చాలన్నారు. పెన్షనర్ల భార్య, భర్త పేరుతో పాటు వారి జన్మదిన వివరాలను రికార్డుల్లో, పేస్లిప్‌లలో స్పష్టంగా పేర్కొనాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి రేడియాలజిస్టుల రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలోని గీతం మెడికల్ కాలేజీ ఎల్లాప్రగడ సుబ్బారావు ఆడిటోరియం వేదికగా ఈ నెల 31, నవంబర్ 1 , 2 తేదీలలో రేడియాలజిస్టుల రాష్ట్ర వార్షిక మహాసభ జరుగనుందని ఎపిఐఆర్ఐఎ అధ్యక్షుడు, డాల్ఫిన్ డయాగ్నస్టిక్స్ డాక్టర్ వి.సురేష్ తెలిపారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ మహాసభలను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సంయుక్తంగా ప్రారంభిస్తారన్నారు. గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ గీతాంజలి బాట్ మానాభనే, ఎన్ఆర్ఐ రేడియాలజిస్టు డాక్టర్ ముక్కమాల అప్పారావు, ఐఆర్ఐఎ జాతీయ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జివి. మోహన్‌ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సదస్సు మొదటి రోజు 31న, ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా సిమ్యులేషన్ పద్ధతిలో బ్రూణదశలోని శిశువుపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్వెన్షన్ విధానాలైన అమ్నియోసెంటీసిస్, షంట్ ప్లేస్‌మెంట్‌లను ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నామన్నారు. వర్క్‌షాప్‌కు తమిళనాడుకు చెందిన డాక్టర్ భావహరణ్, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శిల్పా సతర్కర్, బెంగళూరుకు చెందిన డాక్టర్ కృష్ణ ప్రధాన ఫ్యాకల్టీగా వ్యవహరించనున్నారని తెలిపారు.

రెండు, మూడు రోజుల్లో వైద్య ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు, శాస్త్రీయ పత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈసారి రికార్డు స్థాయిలో 160 రేడియాలజీ పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయని, వాటిలో ఉత్తమమైన 12 పత్రాలను వేదికపై ప్రదర్శించి, అత్యుత్తమమైన



వివరాలు వెల్లడిస్తున్న సురేష్ తదితరులు

మూడింటికి పురస్కారాలు అందజేస్తామన్నారు. రాష్ట్రస్థాయి రేడియాలజీ క్విజ్‌ను న్యూఢిల్లీ ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు శర్మ నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకమైన 'కాకర్ల సుబ్బారావు స్మారకోపన్యాసాన్ని డాక్టర్ రాజు శర్మ ఇస్తారన్నారు. తిరుపతికి చెందిన ఎస్‌విఐఎంఎస్. ప్రొఫెసర్ ఆఫ్ రేడియాలజీ డాక్టర్ ఎవై.లక్ష్మి కి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేస్తామన్నారు. ప్రతిష్ఠాత్మక సదస్సులో పలు రాష్ట్రాల నుంచి 600 మంది రేడియాలజిస్టులు, వైద్య అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల రేడియాలజీ విభాగాధిపతులు పాల్గొని, వైద్య విద్యలో కొత్త ధోరణులు, టెక్నాలజీ వినియోగం, రేడియాలజీ శిక్షణలో అభివృద్ధి మార్గాలు వంటి అంశాలపై చర్చిస్తారన్నారు.కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. సమావేశంలో కెజిహెచ్ హెచ్ఒడి డాక్టర్ బుజ్జిబాబు, అపోలో ఆసుపత్రుల హెచ్ఒడిలు ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ వర్మ, గీతం కళాశాల డాక్టర్ రఘు పాల్గొన్నారు.

19 నుంచి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మాసోత్సవాలు నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు జరగనున్నాయి. నవంబర్ 1న రాట మహోత్సవం ఉంటుంది. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి అందజేశారు. ఆమె మాట్లాడుతూ నవంబర్ 1న ఉదయం 10 గంటలకు రాట మహోత్సవ వేడుక జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఎఇఒ ఆనందకుమార్, ఇఇ రమణ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
E. P. 97/2022 in O. S. 379/2011

Between:
Pusapati Varaha Satyanarayana Raju @ Pusapati Varaha Satyanarayana . . . DHR/Plaintiff
And:
1. Karri Surya Prakash Reddy &
2. Karri Vinodbala
. . . JDRs/Respondents

Notice to:
1. Karri Surya Prakash Reddy, S/o late Papireddy, R/o D.No.25-14-170/1, APSEB Colony, Seethammadhara, Visakhapatnam - 13.
2. Karri Vinodbala, W/o Surya Prakash Reddy, R/o D. No. 25-14-170/1, APSEB Colony, Seethammadhara, Visakhapatnam - 13.

NOTICE TO JUDGEMENT DEBTORS/ RESPONDENTS

Please take notice that the above Decree Holder has filed E.P. 97/2022 on the file of II Additional District Judge, Visakhapatnam: To issue notice to JDRs 1 & 2 under Order XXI Rule 22 as two years elapsed after the date of the Decree, for which the Honorable Court ordered Notice to you by way of this publication as you have not received notices through Court and Registered post. The said matter is posted to **17-11-2025.** On that day you have to appear before the Honourable Court at 10:30 AM and put forth your defense failing which the Honourable Court shall decide as per merits and according to law.

S.S.N. RAJU
S. ROHINI RAJU
Advocates
Visakhapatnam
Cell : 9440777768

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) AT BHEMUNIPATNAM
O.S. No. 480/2022

Between :
Canara Bank, Rep., by its Manager Sri. Mulagada Satyanarayana, S/o Visweswara Rao ... Plaintiff
And :
M/s. Sai Varshini Medicals, Rep. by its proprietor Mr. Hanumalasetti Kumar Babu, S/o. Satya Rao and another ... Defendants

To:
Defendant No.1
M/s. Sai Varshini Medicals, Rep. by its proprietor Mr. Hanumalasetti Kumar Babu, S/o. Satya Rao, and business at D.No.115B, BC colony, Yendada, Visakhapatnam-530045.
Defendant No.2
Mr. Hanumalasetti Kumar Babu, S/o. Satya Rao, Hindu, aged about 40 years and business at D.No.115B, BC colony, Yendada, Visakhapatnam-530045, and also residing at Pedda Street, Veeranarayanam Post, Veeranarayanam, Vizianagaram-535145.

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

Whereas, the plaintiff hereinabove filed the aforesaid suit against you seeking recovery of money and for other reliefs. Whereas, it is found to the satisfaction of the honourable court that you i.e., the defendants 1 and 2 had been evading receipt of summons in the above suit, consistently. The above mentioned defendants 1 and 2 is therefore hereby directed to appear before In The Honourable Court of the Principal Civil Judge (Junior Division) at Bhemunipatnam either in person or through an Advocate or duly Authorized agent, in support of your defence to show cause on **14.11.2025 at 10.30 AM** (Forenoon) as to why reliefs prayed for should not be granted. TAKE NOTICE that in case of default to appear before the Honourable Principal Junior Civil Judge Court, Bheemunipatnam, the suit will be heard and determined in your absence.

By the order of the Honourable Court

J VINAY KUMAR ADVOCATE
D.No.28-2-59, Yellamma Thalli Street, Beside Tummidi Brothers Showroom, Jagadamba Jn., Visakhapatnam-530020
Ph : 9100627656, Email: vinayjamana@gmail.com

THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A.1727/25 IN A.S. /2025

Between:
1.Smt.Pilli Lakshmi
2.Kadagala Venkata Ramana
3.Kadagala Venkata Lakshmi
...Petitioners/Appellants
And:
1.Jagarllapudi Venkateswarlu
2.SarvaDevullu
3.Narasimha Rao
4.Murthy **...Respondents**
To:
Respondent No. 3
Narasimha Rao, Father's name not known to the appellants, aged about 68 Yrs Dr.no. 6-1-1/26, Anjanadri, Bakkannapalem village, PM Palem last bus stop, Visakhapatnam-48.
Respondent No. 4
Murthy, Father's name not known to the appellants, aged about 58 Yrs Dr.no. 6-1-1/26, Anjanadri, Bakkannapalem village, PM Palem last bus stop, Visakhapatnam-48.

I.A. NOTICE

Take notice that I.A.1727/2025 filed in the above appeal by the appellants against you and others, stands posted to **24-11-2025** for your appearance. If you have any objection, you may attend either personally or through an Advocate before the above said court by 10.30 A.M, failing which the matter will be decided exparte in your absence.

Hearing Date : 24-11-2025
(By Order of the Court)
S.M.Zahurullah,
Md.Ahmedunnisa Begum,
Advocates,
D.No. 51-14-23/1, Kranthi Nagar, Nakkavanipalem, Visakhapatnam-13,
Mob No. 9949717006, 7670972405

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
FDP 1/2010

పిటిషనర్లు : చిక్కాల రామ్మోహనరావు (డైడ్) వగైరాలు
రెస్పాండెంట్లు : చిక్కాల ప్రభాకరరావు (డైడ్) వగైరాలు

నోటీసు

R-44: చిక్కాల వెంకట సాయిక్రిష్ణ S/o. లేటు సత్యగోపాలక్రిష్ణ, పెంటకోట గ్రామము, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా
R-45: అమలకంటి శ్రావణి D/o. లేటు సత్య గోపాల క్రిష్ణ, పెంటకోట గ్రామము, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా
R-46: ఉజ్జిన వెంకట రమణ @ ఆక శ్రీను, S/o. లేటు ఉజ్జిన సుబ్బారావు, కృష్ణునిపాలెం, గోకవరం మండలం 533 286, తూర్పు గోదావరి జిల్లా
R-47: ఉట్టిన గోపి S/o. లేటు ఉజ్జిన సుబ్బారావు, కృష్ణునిపాలెం, గోకవరం మండలం-533 286, తూర్పు గోదావరి జిల్లా
R-48: ఉట్టిన నెహ్రూ S/o. లేటు ఉజ్జిన సుబ్బారావు, కృష్ణునిపాలెం, గోకవరం మండలం-533 286, తూర్పు గోదావరి జిల్లా
R-49: Ms గుత్తి దేవి D/o లేటు ఉట్టిన సుబ్బారావు, ఉట్టిన వెంకన్నగారి వీధి, నిడదవోలు, 534 301
R-50: Ms పోతుల గీత W/o. పోతుల లక్ష్మణ రావు, చినదొడ్డిగల్లు గ్రామం, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా-531 081
R-51: Ms పద్మ W/o. లేటు అనిల్ కుమార్, చినదొడ్డిగల్లు గ్రామం, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా-531 081
R-52: చిక్కాల వీరేంద్ర శంకర్ S/o. లేటు చిక్కాల అయ్యన్న దొర, డో.నెం.20-6-70, రామలింగేశ్వరపేట, మెయిన్ రోడ్డు, అయోధ్య నగర్, నిజయవాడ- 520 003
R-53: చిక్కాల శ్రీరామదొర S/o. లేటు అయ్యన దొర, డో.నెం. 20-6-70, రామలింగేశ్వరపేట, మెయిన్ రోడ్డు, అయోధ్య నగర్, విజయవాడ-520 003
R-54: శ్రీమతి వెలగా రమ్య సుధ D/o లేటు అయ్యన దొర, డో.నెం. 20-6-70, రామలింగేశ్వరపేట, మెయిన్ రోడ్డు, అయోధ్య నగర్, విజయవాడ - 520 003
R-55: శ్రీమతి చిక్కాల చిన వెంకాయమ్మ W/o. లేటు రఘురాం, C/o. A.రాజు, గ్రామ సచివాలయం దగ్గర, పెంటకోట, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా
R-56: చిక్కాల వి.సీతారాం S/o. లేటు రఘురాం, 101, 101, 1st Floor, సాయి తులసి అపార్ట్‌మెంట్స్, బత్తాయి తోటవీధి, తుని
R-57: Ms K.గంగా భవాని C/o. K.V.S. నారాయణ, రోడ్ నెం 10, జయంతి గార్డెన్స్, గ్రౌండ్ ఫ్లోర్. తేజ అపార్ట్ మెంట్స్, A.V. అప్పారావు రోడ్డు దగ్గర, రాజమండ్రి- 533 103
R-58: Ms B.ఆదిత్య, C/o. B.రాజేంద్ర, మౌలిక ల్యాబ్, టాజీ జంక్షన్, గోపాలపట్నం, విశాఖపట్నం-530 027
R-59: Ms అడపా రాజేశ్వరి W/o. రాజు, గ్రామ సచివాలయం దగ్గర, పెంటకోట, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా
R-60:చిక్కాల లచ్చన్నదొర S/o. లేటు చలపతిరావు,5-14-85/1. సమితి ఆఫీస్ వీధి, 16 వ వార్డు, తుని, కాకినాడ జిల్లా
R-61: చిక్కాల వెంకట రామారావు S/o. లేటు చలపతిరావు, 9-131, ధర్మరజువారి వీధి, పెదపాడు గ్రామం & మండలం, 534 437, పశ్చిమ గోదావరి జిల్లా
R-62: చిక్కాల మంగపతి రావు, S/o. లేటు చలపతి రావు, 16-1-20, ప్లాట్ నెం 46, వార్డు -16, బత్తిన వెంకటరాజు కొలని, తులసి సిరి లే అవుట్, సామర్లకోట-533440, కాకినాడ జిల్లా

పై నెంబరు FDP 1/2010లో R 44 మరియు R 45 రెస్పాండెంట్లు 11 వ రెస్పాండెంటు అయిన లేటు సత్య గోపాల క్రిష్ణ గారి యొక్క, R 46 నుండి R 49 రెస్పాండేంట్లు 12వ రెస్పాండెంటు అయిన ఉజ్జిన రమావతి గారి యొక్క. R 50 మరియు R 51 రెస్పాండేంట్లు 13వ రెస్పాండెంటు అయిన వెలగా సుగుణవతి గారి యొక్క R 52 నుండి R 54 రెస్పాండేంట్లు 21వ రెస్పాండెంటు అయిన చిక్కాల అయ్యన దొర గారి యొక్క, R 55 నుండి R 59 రెస్పాండెంట్లు 22వ రెస్పాండెంటు అయిన చిక్కాల రఘురాం గారి యొక్క, R 60 నుండి R 62 రెస్పాండెంట్లు 37 వ రెస్పాండెంటు అయిన చిక్కాల అన్నపూర్ణ గారి యొక్క వారసులు అయినందున, మిమ్ములను పిటిషను లో పార్టీగా చేర్చినందున, మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా, రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ పూర్వకముగా అందుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునదేమనగా **తే:06-11-2025 ది ఉదయం 10.30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు వ్యక్తిగతముగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలియ పరుచుకొనవలెను. లేనిఎడల శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటిషను మీ పరోక్షమున తీర్మానించడమగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియ పరచడ మైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

పిటిషనర్ తరపు న్యాయవాది
శ్రీమతి ఎస్.వి.లక్ష్మి , హరిశంకరరావు
అడ్వకేట్లు యలమంచిలి
సెల్: 9247895643

యలమంచిలి
తేది:29-10-2025

తుపాను నష్టాల పరిశీలన

ప్రజాశక్తి- యంత్రాంగం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం నాయకులు, అధికారులు, పలు సంస్థల ప్రతినిధులు పర్యటించారు. అవసరమైన చోట ఆహారం అందించారు. ఎమ్మెల్యేలు, అధికారులు తుపాను నష్టసహాయాలను అందించారు.

మాధవధార : ఇటీవల కురిసిన వర్షాలకు కంచరపాలెం ప్రాంతంలోని చాకలి గెడ్డ, ముత్యమాంబ కాలనీ, రాజీవ్‌కాలనీ, అంబేద్కర్‌కాలనీ, పైడిమాంబ కాలనీలో సిపిఎం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, నాయకులు జి.శ్రీనివాసరావు పర్యటించారు. తుపాను కారణంగా ఇబ్బందులకు గురవుతున్న కుటుంబాలను పరామర్శించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొట్ట ఈశ్వరమ్మ మాట్లాడుతూ, దయానందనగర్, అంబేద్కర్ కాలనీ, రాజీవ్ కాలనీ ప్రాంతాల్లో ప్రహరీలు కూలి పేద ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. గెడ్డలో మురుగు నీరు పొంగి అంబేద్కర్ కాలనీ, రాజీవ్ కాలనీలో రోడ్లమీదకు, ఇళ్లలోకి చేరాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, దుర్గా, కృష్ణ, హరి, శేఖర్, శివ, గౌరి, శ్యామ్, నటరాజ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి శాంతిశ్వరూప్ కాలనీలో ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గణబాబు పర్యటించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుర్రె సురేష్ యాదవ్, రామ్మోహన్‌నాయుడు, రావల సత్యనారాయణ పాల్గొన్నారు.

తగరపువలస : భీమునిపట్నం మండలం సింగన్న బంధ, తాటితూరు, దాకమర్రి, టి.నగరపాలెం, అమనాం, మజ్జిపేట పంచాయతీల పరిధిలో తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. నీట మునిగిన, నేలకొరిగిన వరి పంటను పరిశీలించి, నమోదు చేశారు. రైతులకు పూర్తి పరిహారం అందేలా చూస్తామని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, విఆర్ఒ శ్యామ్‌సుందర్, విలేజ్ అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రమీల, గాడు అప్పలనాయుడు పాల్గొన్నారు.



నీట మునిగిన వరి పొలాలు

ఆర్థిక సాయం



బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ : తుపాను కారణంగా పునరావాస కేంద్రంలో ఉంటున్న బాధితులకు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. గురువారం సాయంత్రం తోటగరువు కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తహశీల్దార్ పాల్‌కిరణ్‌తో కలిసి 36 మందికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. దీనితో పాటు 25 కేజీల బియ్యం, ఆరు రకాల కిరాణా సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవింద్, కెల్ల సత్యనారాయణ, మద్దిల రాజశేఖర్, ఓమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, ముగడ రాజారావు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు తహశీల్దార్ శ్రీనుబాబు రూ.1,000 చొప్పున నగదు సహాయం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శారదాప్రియాంక, నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, సర్పంచ్ బిఆర్‌బి. నాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధిలో ఇళ్లు, కొండచరియలు జారిపడిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం రూ.1,000చొప్పున ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ కట్టుమూరి సతీష్ అందించారు. 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు నూనె, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నజీర్, సురేష్ బాబు, తహశీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ త్రినాథ్, విఆర్ఒ ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహారం అందజేత



ఆహారం పంపిణీ చేస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస : చిప్పాడ దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యాన అన్నవరం, పెద్దనాగమయ్యపాలెం, చిప్పాడలో ముంపు ప్రాంతాల ప్రజలకు టిఫిన్, భోజనాలు ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత సహాయంతో సుమారుగా 750 మందికి ఆహారాన్ని సిఎస్ఆర్ ప్రతినిధులు అందించారు. ఈ కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ ప్రతినిధి శ్రీనివాస్, సచివాలయ సెక్రటరీలు గోపాలకృష్ణ, రాణి, రామచంద్రరావు, విఆర్ఒలు రాజు, కృష్ణప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి తాండ్ర పాపారాయుడు కళ్యాణ మండపంలో పునరావాసం కల్పించిన ఏకలవ్య కాలనీవాసులకు వైసిపి నాయకులు శరగడం చిన్న అప్పల నాయుడు ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్లె రాము, అవగడ్డ సోమునాయుడు, గొంప రత్నం, రాజు, ఎస్ఎం.నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పల్లిగెడ్డలో విద్యార్థిని గల్లంతు



ధనుష

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ పరిధి తునిపాలెం గ్రామానికి చెందిన కళ్ల ధనుష (12) పల్లగెడ్డలో గురువారం గల్లంతైంది. మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతోంది. ప్రభుత్వం ఇచ్చిన తుపాను సెలవులు కారణంగా ఇంటి వద్దే ఉంది. పల్లెగెడ్డలో మంగళ బుధవారం నీరు భయంకరంగా ప్రవహించింది. గురువారం నీరు తగ్గిందని ఆ నోటా ఈ నోటా విన్న పిల్లలు సరదాగా కాజ్‌వే వైపు వెళ్లారు. నలుగురు పిల్లలు కాజ్‌వేపై కాళ్లు, చేతులు కడుక్కొంటూ ఉండగా ధనుష కాలు జారి పడిపోయి గల్లంతైంది. మిగిలిన పిల్లలు కేకలువేయడంతో సమీపంలోనే బట్టలు ఉతుకుతున్న మహిళలకు అక్కడికి చేరుకొని విషయం తెలుసుకొని గ్రామంలోకి వచ్చి చెప్పారు. గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ, విద్యాశాఖ, అగ్నిమాపక, మండల పరిషత్ కార్యాలయ అధికారులు గ్రామానికి చేరుకొని పరిశీలించారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు వచ్చి గాలింపు చేపట్టారు. గురువారం చీకటి పడినా బాలిక ఆచూకీ లభించలేదు.

ధనుషకు తల్లి గౌరి, తండ్రి శ్రీను, అక్క అపర్ణ ఉన్నారు. అపర్ణ పద్మనాభం కెజిబివిలో 9వ తరగతి చదువుతోంది. తల్లి గౌరి బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం విశాఖపట్నం వెళ్లారు. తండ్రి శ్రీను, ధనుష ఇంటి వద్ద ఉన్నారు.

మద్ది గ్రామంలోనికి వెళ్లి వస్తాను ఇంటి దగ్గర ఉండి మధ్యాహ్నం అన్నం తిను అని చెప్పి వెళ్లాలని ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని తండ్రి శ్రీను రోదిస్తున్నాడు.

పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావు, ఎంపిడిఒ కె.రూపేష్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, సిఐ శ్రీధర్, ఎస్ఐ సురేష్, మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి, ఎంఇఒ పి.రమణబాబులాల్, చిట్టివలస అగ్నిమాపక కేంద్రం అధికారి జి శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఆఫీసర్ శ్యామల, విఆర్ఒ అప్పలరాజు, విఆర్ఎ ప్రియాంక, భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, నాయకులు మజ్జి వెంకట్రావు, సన్యాసమ్మ, బి.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ తదితరులు గ్రామానికి చేరుకొని పరిశీలించారు.

గుడిలోవలో లారీ బోల్తా

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గుడిలోవ జాతీయ రహదారిపై గురువారం ఉదయం లారీ బోల్తా పడింది. బెంగళూరు నుంచి కోల్‌కతాకు అల్లం లోడుతో వెళ్తున్న లారీ పెందుర్తి వైపు నుంచి ఆనందపురం వైపు వస్తుండగా గుడిలోవ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఘనంగా గంటా రవితేజ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండల యువత ఆధ్వర్యంలో భీమిలిలోని నేత్ర విద్యాలయంలో గంటా రవితేజ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేత్ర విద్యాలయం పిల్లల మధ్య కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరాడ వైకుంఠ, మరిపిల్ల సాయిజ్ఞానేశ్వర్, కాకర సురేష్‌కుమార్, అక్కిరెడ్డి దేవుడుబాబు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీచేస్తున్న శ్రీనివాసరావు

తగరపువలస : గంటా రవితేజ జన్మదిన సందర్భంగా నిడిగట్టు గ్రామంలోని సద్గురు సేవా ఆశ్రమంలో ఉన్న వృద్ధుల సమక్షంలో స్టేట్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ గిరి శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. రవితేజకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులందరికీ దుప్పట్లు, పండ్లు, పంపిణీ చేశారు. గంటా రవితేజ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధికి రూ.5 లక్షలు

మధురవాడ : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు, టిడిపి యువ నాయకుడు గంటా రవితేజ సిఎం సహాయ నిధికి రూ.5 లక్షలు అందజేశారు. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో గురువారం కలిసి చెక్కును అందించారు. మొంథా తుపాను రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపిన నేపథ్యంలో గురువారం తన పుట్టినరోజు వేడుకలను రవితేజ రద్దు చేసుకున్నారు. బాధితులను ఆదుకోవడానికి తన వంతు బాధ్యతగా ఈ విరాళం అందించారు. 'గీత మకరందం' ఆధ్యాత్మిక గ్రంథాన్ని లోకేష్‌కు బహూకరించారు. రవితేజకు లోకేష్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని లోకేష్ సూచించారు.

మొబైల్ అతి వాడకంతో గుండెపోటు

ప్రజాశక్తి-మధురవాడ : మొబైల్ వీక్షణం మితిమీరడం, నిద్రలేమి, మత్తుపదార్థాల వినియోగం, తీవ్ర ఒత్తిడులకు గురికావడం వంటివి యువతలో గుండెపోటుకు దారితీసే అవకాశం ఉందని గీతం ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కరరావు తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినం సందర్భంగా గురువారం గీతం ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ, 45 సంవత్సరాలలోపు వయస్సువారిలో గుండెపోటు రావడానికి ప్రధాన కారణం ఆరోగ్యపు అలవాట్లేనని చెప్పారు. సాధారణంగా అధికరక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, పొగతాగడం, ఊబకాయం వంటివి గుండెపోటుకు దారితీస్తాయని పేర్కొన్నారు. గీతం ఆసుపత్రిలో ఏటా 500 మంది రోగులను తాము పరీక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలతో చికిత్స అందించి సురక్షితంగా రోగులను తిరిగి పంపుతున్నామన్నారు. బరువు కోల్పోవడం, దృష్టిలోపాలు, చేతులలో బలహీనత, సరిగా మాట్లాడలేక పోవడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు సమీపంలోని వైద్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. గుండెపోటు సంభవించినప్పుడు మొదటి 4 నుంచి 5 గంటల సమయం విలువైనదని, సకాలంలో చికిత్స ప్రారంభిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని చెప్పారు. ఈ వైద్యశిబిరానికి ఎండాడ, సాగర్‌నగర్, రుషికొండ పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున స్థానికులు హాజరయ్యారు. ప్రపంచ స్ట్రోక్ దినం సందర్భంగా జిమ్సర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిమ్సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, డాక్టర్ వి.దీప్తి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అంధకారంలో స్టీల్‌ప్లాంట్ బిసి గేటు రోడ్డు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ బిసి గేటు రోడ్డులో అంధకారం నెలకొంది. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ప్రతిరోజు ఈ రోడ్డు మీదుగా ప్రయాణిస్తుంటారు. బిసి గేటు రోడ్డులో పది రోజులుగా లైట్లు వెలగడం లేదు. దీంతో రోడ్డు మొత్తం చీకటిమయంగా ఉంది. నిర్వాసిత కాలనీకి చెందిన 14 గ్రామాల కార్మికులు, గాజువాకలో నివాసం ఉంటున్న కార్మికులు, గంగవరం గ్రామానికి చెందిన కార్మికులు ఈ రోడ్డు ద్వారానే ప్రయాణం చేస్తారు. రాత్రి సమయంలో ఈ రోడ్డు వెంబడి ప్రయాణానికి కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డు కనిపించక, కటిక చీకటిలో ద్విచక్ర వాహనం నడపలేక గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో చీకటి కారణంగా గుర్తించలేక పడిపోతున్నారు. స్టీల్ యాజమాన్యం తమకు సంబంధం లేనట్లు వ్యవహరించడం వల్ల కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై గతంలో కూడా అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినాస్పందన లేదని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి లైట్లు వెలిగేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.



అంధకారంలో ఉన్న బీసీ గేటు రహదారి



కోలుకున్న రోగితో కిమ్స్ ఐకాన్ వైద్యులు

అవయవాల వైఫల్యానికి అత్యాధునిక చికిత్స : రవికృష్ణ

ప్రజాశక్తి- గాజువాక : పలు అవయవాలు వైఫల్యంతో వచ్చిన ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన ఓ యువకునికి కిమ్స్ ఐకాన్ వైద్యులు అత్యాధునికి చికిత్స అందించి ప్రాణదానం చేసినట్లు ఆసుపత్రి డాక్టర్ ఎం.రవికృష్ణ తెలిపారు. ఒడిశా వైద్యులు ఏమీ చేయలేక కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి సమాచారం అందించారని, డాక్టర్ ఎం.రవికృష్ణ నేతృత్వంలోని క్రిటికల్ కేర్ బృందం అక్కడకు వెళ్లి 25 ఏళ్ల యువకుడికి ఎక్మోపెట్టి, రోడ్డు మార్గంలో విశాఖకు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇంజినీర్ అయిన ఆ రోగికి మెదడు, ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు, కాలేయం.. ఇలా పలు అవయవాలు విఫలమయ్యాయని డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఆ యువకునికి ఊపిరితిత్తులు గాయపడ్డాయని, కార్డియోజెనిక్ షాక్ వచ్చిందని, మెదడులో రక్తస్రావం అయ్యిందని, కాలేయం, మూత్రపిండాలు విఫలమయ్యాయని గుర్తించామని వివరించారు. రెండేళ్ల నుంచి అతడికి తీవ్రమైన ఆందోళన, చెమటలు పట్టడం లాంటి లక్షణాలున్నట్లు తెలిసిందన్నారు. అతడు ఫియోక్రోమోసైటోమా (పిఎంసి) అనే అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. అడ్రినల్ గ్రంధిమీద ఏర్పడిన కేన్సర్ కణితి వల్ల నియంత్రణ లేకుండా అడ్రినలిన్ స్రవించడం మొదలైందని, అదికూడా అప్పుడప్పుడు మాత్రమే స్రవించడంతో ముందుగా దీనికి పరీక్షలు చేసినా నెగెటివ్ వచ్చేదని పేర్కొన్నారు. ఉన్నట్టుండి లక్షణాలు చాలా తీవ్రంగా వచ్చాయని తెలిపారు. 9 రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ శ్రావణి తన్నా పరీక్షించి కేన్సర్ మొదటి దశలో ఉన్నట్లు గుర్తించి నాలుగు వారాల తర్వాత అతడికి లాప్రోస్కోపిక్ పద్ధతిలో కణితిని తొలగించినట్లు వివరించారు. చికిత్సతో అతడు బాగా కోలుకున్నాడని డాక్టర్ రవికృష్ణ వివరించారు.

అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, శరీరానికి అవసరమైన అయోడిన్ సరిపడా అందకపోవడం వల్ల థైరాయిడ్ గ్రంధి పనితీరును దెబ్బతీసి, గాయిటర్ (థైరాయిడ్ గ్రంధి వాపు), హైపోథైరాయిడిజం వ్యాధులకు దారితీస్తుందని తెలిపారు. గర్భధారణ సమయంలో, బాల్యంలో దీని లోపం తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందన్నారు. అయోడిన్ లోపం వల్ల కలిగే అనార్థాలు, థైరాయిడ్ గ్రంథిలోని టి4 ఫార్మేషన్‌కు అయోడిన్ ఎంతో అవసరం తదితరాలను వివరించారు. అయోడిన్ లోపం వల్ల అలసట, బలహీనత, అసహనం, బరువు పెరగడం వంటివి కనిపిస్తాయని తెలిపారు. పిల్లల ఎదుగుదలలో అయోడిన్ ఎంతో అవసరమన్నారు. అయోడిన్ లోపం వల్ల మహిళల్లో గర్భస్రావం, పురుషుల్లో బుద్ధి మాంద్యం వస్తాయన్నారు. కంటి చూపు దెబ్బతినడం, ఎదుగుదల లోపించడం, బుద్ధి మాంద్యం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. అయోడిన్ అధికంగా ఉండే దానిమ్మ, పెరుగు, స్ట్రాబెర్రీ, బంగాళదుంప వంటివి తినాలని, చేపలు, రొయ్యలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, మాంసం ద్వారా కూడా అయోడిన్‌ను పొందవచన్చి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్‌సిడి డాక్టర్ హారిక, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'విశాఖ పాలిటెక్నిక్'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-పెందుర్తి/ వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విదార్థులకు కెర్నెక్స్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలలో 19 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.5 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్, డీన్ సిడిసి.వర్మ అభినందించారు. కళాశాల ప్లేస్‌మెంట్ టీమ్ ఎం.సుదీప్తి, కె.మోహనకృష్ణ పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి.

ప్రమాదంలో భారత రాజ్యాంగం : డిహెచ్‌పిఎస్



కరపత్రాలను విడుదలచేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని రక్షించుకోవాల్సిన కర్తవ్యం అన్ని వర్గాలపై ఉందని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ పేర్కొన్నారు. నగరంలోని రామా టాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం- దళిత హక్కులు -బిజెపి విధానాలపై రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నవంబర్ 1వ తేదీన పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు కేంద్రంలో పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే ఇప్పటికే లౌకికవాదం, ప్రజాస్వామ్యం లాంటి పదాలు రాజ్యాంగం నుంచి తొలగించేవారని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్న రాజ్యాంగ పీఠిక నుండి వాటిని తొలగించాల్సిన అవసరం లేదని పలుమార్లు సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. అయినా మనువాద ప్రభుత్వం ఆగటం లేదన్నారు. హిందూదేశంగా మార్చాలనే ఆలోచన రాజ్యాంగాన్ని వ్యతిరేకమన్నారు. దేశంలో ఉన్న సంపదనంతా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర సాగుతుందని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల రిజర్వేషన్లు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని దోషులు తప్పించుకునే విధంగా 41(ఎ) నోటీసులిస్తూ స్టేషన్ బెయిల్‌లో కేసులను నీరుగారిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజులు, కార్యదర్శి జి.రాంబాబు, ప్రతినిధులు బి.శ్రీనివాస్, పి.వీర్రాజు, ఆర్.సరస్వతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రేమానందరావు ఉద్యోగ విరమణ



ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ కూర్మాన ప్రేమానందరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. 39 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ప్రేమానందరావు విధి నిర్వహణలో అంకిత భావం ప్రదర్శిస్తూనే విద్యార్థుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు కనబరిచే వారని తోటి ఉపాధ్యాయులు చెబుతున్నారు. 1986లో శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం, ఎస్.రంగారాయపురంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అక్కడ 1989 వరకు పనిచేశారు. అదే జిల్లా రణస్థలం మండలం, దేవునిపాలవలస ఎంపిపి పాఠశాలలో 1989 నుంచి 1993 వరకు విధులు నిర్వహించారు. 1993 నుంచి 1998 వరకు విశాఖ జిల్లా, భీమిలి మండలం టి.నగరపాలెం ఎంపిపి పాఠశాలలో ఎస్‌జిటిగానే ఆరేళ్లు పనిచేశారు. 1998 నుంచి 2005 వరకు మండల రిసోర్స్ పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా పని చేశారు. జివిఎంసి 4వ వార్డు జెవి.అగ్రహారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మూడేళ్ల పాటు ఎస్‌జిటిగా చేశారు. భీమిలి మండలం పెద నాగమయ్యపాలెం ఎంపియుపి పాఠశాలలో హెచ్‌ఎంగా రెండేళ్లు, ఆనందపురం మండలం బోయిపాలెం జెడ్‌పి హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పదేళ్లు, ఆనందపురం మండలం, ఆనందపురం జెడ్‌పి హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా మూడేళ్ల పాటు పనిచేశారు. ఉపాధ్యాయునిగా పని చేసిన ప్రతి చోటా విద్యార్థుల అభిమానం, వారి తల్లి దండ్రుల ప్రేమ, ఆప్యాయతలను చూరగొన్నారు.

ఎన్నో అవార్డులు...

మండల, జిల్లా స్థాయిలో రెండేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. భీమిలి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి మంత్రిగా సుదీర్ఘకాలం పని చేసిన ఆర్‌ఎస్‌డి.అప్పల నరసింహరాజు, విజయనగరం జిల్లా భోగాపురం నియోజక వర్గానికి గతంలో సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి, మంత్రిగా పని చేసిన పతివాడ నారాయణస్వామి నాయుడు చేతుల మీదుగా అనేక సందర్భాల్లో అవార్డులు అందుకున్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పంచాయతీ సర్పంచులు, మండలాల అభివృద్ధిలో ఎంపిపిలు, ఎంపిటిసిల పాత్ర, విధులు, నిధులు తదితర అంశాలపై ప్రభుత్వాలు నిర్వహించిన శిక్షణా తరగతులు ఫలవంతం అవ్వడంలో ప్రేమాందరావు పాత్ర ఎంతో ఉందని పలువురు ఇప్పటికీ అభిప్రాయపడుతున్నారు. ఈ తరహా శిక్షణ తనకు ఎంతో సంతృప్తి ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కవిగా, రచయితగా

ఎన్నో సామాజిక పరమైన అంశాలను విశ్లేషిస్తూ ఎన్నో కవితలు, రచనలు చేసి పలువురి మన్ననలు అందుకున్నారు. యంగ్ మెన్ క్రిష్టియన్ అసోసియేషన్, ఎబి చర్చి పాలక వర్గంలో పలు పదవులు చేపట్టారు. షటిల్ క్రీడాకారునిగా కూడా గుర్తింపు పొందారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ పరిధి తునిపాలెం గ్రామం ప్రాథమిక పాఠశాల సమీపంలో సిసి రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం మధ్యలో విరిగిపోయి ప్రమాదకర స్థితిలో ఉంది. నాలుగు నెలలుగా ఈ స్తంభం ఇదే పరిస్థితిలో ఉందని గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు గుర్తించి ఈ స్తంభాన్ని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచల పుణ్య క్షేత్రంలో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా 108 బంగారు పుష్పాలతో స్వర్ణ పుష్పార్చనను గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాత్ణకాల పూజలు సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజు స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధీష్టింపజేసి వేద మంత్రాలు నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన, సేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆర్జిత సేవలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

'రాధాకృష్ణ మహోత్సవాలకు తరలిరావాలి'

ప్రజాశక్తి -ములగాడ : ఆర్‌కె.బీచ్‌లో నవంబర్ 5వ తేదీన జరిగే రాధాకృష్ణ మహోత్సవాలకు తరలిరావాలని తోణంగి వెంకటరమణి కోరారు. ఈ మేరకు ఆహ్వానపత్రిలను పలువురికి పంచిపెట్టారు. జివిఎంసి మాజీ మేయర్‌ను కలిసి ఆహ్వానం అందజేశారు. వెంకటరమణి మాట్లాడుతూ, ఏటా మాదిరిగానే ఈ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి కుంచమ్మ, చందక రత్నం, ఒమ్మి ఈశ్వరి, నక్క పద్మ, ఏదిరి అనురాధ, అప్పలకొండమ్మ, ఓమ్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- గాజువాక : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పాతవడ్లపూడిలో 87వ వార్డు అధ్యక్షులు బి.గోవింద ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ హయాంలో ఏడు మెడికల్ కాలేజీ పూర్తయ్యాయని, మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. వైద్య విద్య ప్రయవేటీకరణ వల్ల పేద విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రాడ వెంకటరమణ, బొడ్డ వెంకటసూరి, ఆడారి శ్రీను, గాలి నూకరాజు, పి.అప్పారావు, ఎం.తవిటయ్య, పి.అప్పారావు, పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు బొడ్డ గోవింద్ తదితరులు

నష్టాన్ని మిగిల్చిన మొంథా

- నీట మునిగిన పంట పొలాలు
- చెరువులకు గండి
- రోడ్లపై వరద నీరు



అనకాపల్లి : ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుళ్ల గెడ్డ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మొంథా తుఫాను బీభత్సం సృష్టించింది. నాలుగు రోజుల నుండి తెరిపి ఇవ్వకుండా వర్షాలు కురవడంతో పాటు గురువారం తెల్లవారుజాము నుండి కుండపోత వర్షం పడింది. దీంతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వడ్డాదిలో పెద్దేరు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో వందలాది ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. బిఎన్ రోడ్లో గోతులు చెరువులను తలపిస్తున్నాయి. మరో వైపు రాజాం గ్రామంలో అప్పలనాయుడు చెరువుకు గండి పడి వరద నీరంతా ఆర్టీ రోడ్డుపై పొంగి ప్రవహిస్తోంది. రోడ్డుపై మోకాళ్ళ లోతు నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రాజాం నుండి తట్టబంద వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ చెరువులన్నీ ఆక్రమణలకు గురవడంతో తరచూ గండి కొడుతున్నాయని స్థానికులు ఆరోపించారు. చెరువులలో ఆక్రమణలు తొలగిస్తే ఈ పరిస్థితి రాదన్నారు. మండల ప్రత్యేక అధికారి గోపాల రాజు, తహసిల్దార్ లక్ష్మి, ఇతర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు.

కశింకోట : మండలంలోని శారదా నది ఉధృతి కారనంగా నది పరివాహక ప్రాంతంలో పంటలు నీట మునిగాయి. తాళ్ళపాలెంలో మామిడి వాక గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. అచ్చర్ల పంది గెడ్డ బ్రిడ్జిపై నుండి నీరు ప్రవహిస్తుంది. రంగుబోలు గెడ్డ రిజర్వేయర్‌ను గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, సానబోయన శ్రీను పరిశీలించారు.

ఎడ్ల గెడ్డ పొంగి రాకపోకలకు అంతరాయం

యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణం నుంచి రామారాయుడుపాలెం, తూరంగాలపాలెం, జంపాలెంతో పాటు మరో పదిహేను ఊళ్లకు వెళ్లే మార్గంలో ఉన్న ఎడ్ల గెడ్డ కాల్వర్ట్ కూలిపోయి వరద నీరు రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల సమయంలో ప్రతి ఏటా ఇదే పరిస్థితి అన్ని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు పునర్నిర్మాణం చేయాలని యలమంచిలి ఎఎంసి ఉపాధ్యక్షులు గొర్లి బాబురావు డిమాండ్ చేశారు. ఈ సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామని విఆర్ఓ నూకరాజు ప్రజాశక్తికి తెలియజేశారు.



నర్సీపట్నం : నీట మునిగిన పొలాలు

గాజువాక బైపాస్ రోడ్ తాత్కాలిక మూసివేత

యలమంచిలి టౌన్ : యలమంచిలి నుంచి వయా అచ్యుతాపురం మీదుగా గాజువాక వెళ్లే బైపాస్ రోడ్‌లో నారాయణపురం వద్ద మైనర్ శారదా నది ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికారులు ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మరో వైపు మైనర్ శారదా నది వరద ఉధృతి వల్ల వ్యవసాయం, చేపలు చెరువులు దెబ్బతిన్నాయి. ముంపు ప్రాంతాలను శాసనసభ్యులు విజయకుమార్, కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరిశీంచారు.



యలమంచిలి : నారాయణపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

గెడ్డ ప్రవాహంలోనే రాకపోకలు

అనకాపల్లి : గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెదుళ్ళ గెడ్డ పొంగి ప్రవహించడంతో మండలంలోని రొంగలివానిపాలెం శివారు రేవడిలో సుమారు పది కుటుంబాలు వారు వరద నీటి ప్రవాహంలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వారికి ఇప్పటి వరకు ఎటువంటి సహాయ చర్యలు అందలేదు. వీరి పశువుల కల్లాలు, పాకలు వరద ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తీవ్రంగా భయపడుతున్నారు. ఇక్కడ నివసించే 10 కుటుంబాలు కేవలం పాడి పశువుల మీదే ఆధారపడి ఆ పాలు అమ్ముకొని జీవిస్తున్నారు. వర్షాలకు గెడ్డ పొంగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పాలు కనీసం తీసుకువెళ్లే అమ్ముకునేందుకు అవకాశం లేక ఇబ్బంది పడుతున్నారు. తమకు ప్రభుత్వ స్థలాలు మంజూరు చేయాలని వీరంతా కోరుతున్నా కనీసం పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. వీరికి సంబంధించి కొన్ని ఇళు కూంద్రం, మరికొన్ని ఇళ్లు కుంచంగి రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. వీరి సమస్యను ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు.

రైతులను ముంచిన మొంథా

నర్సీపట్నం : మొంథా తుఫాను కారణంగా గురువారం కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లపై నుంచి నీళ్లు ప్రవహించాయి. జోగునాదుని పాలెం వద్ద చెరువు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది.మాకవరపాలెం మండలంలో చెరువులు నిండు కుండల్లా ఉండడంతో తహసిల్దార్ వెంకటరమణ సహాయక చర్యలు చేపట్టారు. పైడిపాల శివాలయం గర్భగుడిలోకి నీరు చేరింది. జి కోడూరు గ్రామంలో వరి పంట నీట మునిగింది.

14 హెక్టార్లలో వరి పంటకు నష్టం

గొలుగొండ : మొంథా తుపాన్ నేపథ్యంలో కురిసిన భారీ వర్షం కారణంగా మండలంలో ఇప్పటి వరకు 14 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగింది. మండలంలో లింగంపేట, గైరంపేట, కృష్ణదేవిపేట ప్రాంతాల్లో వరి పంటలు నేలకొరిగింది. దారగెడ్డ, విప్పలపాలెం, రావణాపల్లి జలాశయాల దిగువన పంట నష్టం అంచనా వేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు.

మూడు గొర్రెలు, గేదె మృత్యువాత

గొలుగొండ : మొంథా తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు గొలుగొండ మండలంలో 3 గొర్రెలు, ఒక గేదె మృతి చెందినట్లు గుర్తించామని గొలుగొండ పశు వైద్యాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. తుపాన్ కారణంగా ప్రధానంగా పశు వుల మేత కొరత, పశువుల ఆశ్రయ కేంద్రాలు దెబ్బతినడంతో కొంత మేర పశువుల మరణాలు సంభవించాయన్నారు. అదే విధంగా రాబోయే రోజుల్లో పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు గాలికుంటు వ్యాధి, జబ్బ వాపు వ్యాధి, గొంతు వాపు వ్యాధి టీకాలు వేశామన్నారు.

శారదానదిలో చిక్కుకున్న కుటుంబం

సాహసోపేతంగా రక్షించిన అగ్నిమాపక, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామం పరిసర ప్రాంతాలలో శారదా నదిలో ఓ కుటుంబం చిక్కుకుంది. నది ఉధృతంగా ప్రవహించే క్రమంలో నది మధ్యలోని పామాయిల్ తోటల వద్ద ఉన్న ఒకే కుటుంబానికి చెందిన కె.ప్రసాద్, ఆయన భార్య సువార్త, కుమారుడు చందు నీటిలో చిక్కుకుపోయారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు అగ్నిమాపక శాఖ, రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్) సంయుక్తంగా గురువారం వేగవంతమైన రక్షణ చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శకటంతో ప్రమాదస్థలానికి చేరుకున్న బృందాలు, శారద నతది మధ్యలో చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా రక్షించాయి. అనంతరం వారిని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరామర్శించి, దిమిలి ప్రభుత్వం పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సాహసోపేత రక్షణ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వెంకట రమణ, యలమంచిలి అగ్నిమాపక అధికారి డి.రాంబాబు, పరవాడ డిఎస్‌పి విశ్వ స్వరూప్, రాష్ట్ర విపత్తుల స్పందన దళం సభ్యులు పాల్గొన్నారు.



కుటుంబాన్ని రక్షించడానికి వచ్చిన అగ్ని మాపక, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు

శారద నదిలో కొట్టుకుపోయిన పంపు హౌస్

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ వద్ద శారద నది సమీపంలో ఏర్పాటు చేసిన తాగునీటి పంపు హౌస్ శారద నది ఉధృతికి కొట్టుకుపోయింది. గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ, గవరపేటకు తాగునీరు అందించేందుకు శారద నదికి 50 అడుగుల దూరంలో పంపు హౌస్‌ను ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ఇక్కడ నుండి ఇందిరమ్మ కాలనీలో గల వాటర్ ట్యాంకుకు నీరు అందిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రైవాడ రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో శారద నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహించి పంపు హౌస్ మొత్తంగా కొట్టుకుపోయింది. గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, వార్డు మెంబర్ తనకల అప్పలనాయుడు గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

కోతకు గురవుతున్న శారద నది పరివాహక ప్రాంతం

- ఆందోళన చెందుతున్న రైతులు




చౌడువాడ వద్ద కోత గురైన శారద నది పరివాహక ప్రాతంతం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామం పొలాలు గుండా ప్రవహిస్తున్న శారద నది పరివాహక ప్రాంతం కోతకు గురవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో రైవాడ రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో శారద నదిలో వరద నీటి ఉధృతి పెరిగింది. గతంలో గవరవరం నుంచి గోవాడ బ్రిడ్జి వరకు ఇసుక తీయడంతో శారద నది సుమారుగా 20 నుంచి 30 అడుగుల లోతు ఏర్పడింది. దీంతో ఇప్పుడు నది ఉధృతి కారణంతా నది ఒడ్డున ఉన్న భూములు సులువుగా కోతగా గురవుతున్నాయి. ఈ భూముల్లో విలువైన పంటలు, వృక్షాలు సైతం నీటి పాలవుతున్నాయి. దీంతో నది ఒడ్డున భూములున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చౌడువాడ శివారు మల్లమ్మ పాలెం గ్రామం మొదలుకొని జుత్తాడ వెళ్లే రోడ్డు వరకు నదికి తూర్పు వైపు ఉన్న అత్యంత విలువ గల భూములు ప్రతి ఏడాది నదీ ప్రవాహానికి రైతులు కోల్పోతున్నారు. సుమారుగా రెండు కిలోమీటర్ల పొడవునా శారద నది కోతకు గురవుతున్నది. హుదూద్ తుఫాన్ సమయంలో అత్యధికంగా నది ఒడ్డున భూములు కోతకు గురికాగా, ఇప్పుడు మరో సారి నది ఒడ్డున భూములు ఏటిలో కలిసిపోతున్నాయి. సుమారుగా నది నుంచి 100 అడుగుల వరకు కోతకు గురైనట్లు అక్కడి రైతులు చెబుతున్నారు. మరో వైపు జిత్తాడ వెళ్లే మార్గం వద్ద ఉన్న మిత్రాస్ కాలనీ పూర్తిగా కోతకు గురై నదిలో కలిసిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. శారద ఉధృతి కారణంగా ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఆందోళనతో ఆ కాలనీవాసులు బుధవారం రాత్రంతా మేల్కొని ఉండవలసిన పరిస్థితి నెలకొంది.

శారద నది గట్టుకు రక్షణ చర్యలు

మునగపాక : శారద నది పరివాహక గ్రామమైన మండలంలోని గణపర్తి శారద నది గట్టు బలహీనపడటంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు బుధవారం రాత్రి రక్షణ చర్యలు చేపట్టారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు, గ్రామస్తుల సహకారంతో సుమారు 600 ఇసుక బస్తాలు గట్టుపై వేసి గ్రామంలోకి, పొలాలలోనికి నీరు చొరబడకుండా చర్యలు చేపట్టారు. సహాయక చర్యల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్, ఎలమంచిలి సీఐ ధనుంజయ్‌రావు, స్థానిక ఎస్సై ప్రసాద్ రావు, ఎమ్మార్వో సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



శారద నది గట్టును పటిష్టం చేస్తున్న దృశ్యం

ఇసుక బస్తాలతో ఎడమ గట్టు పటిష్టత

కశింకోట : శారద నది ఉధృతి కారణంగా మండలంలోని వెదురుపర్తి గ్రామం వద్ద శారద నది ఎడమగట్టు గురువారం కోతకు గురైంది. దీంతో అనకాపల్లి డిఎస్పి శ్రావణి, కసింకోట సీఐ అల్లుస్వామి నాయుడు ఆధ్వర్యంలో కూలీల సహాయంతో ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గట్టును పటిష్టం చేశారు. దీంతో వెదురుపర్తి గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దారు తిరుమలరావు, మండల స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీ సుభాషిని పాల్గొన్నారు.



శారద నది గట్టు పటిష్టత ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం

తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్‌పి సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఊకపల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. నూతనంగా మహిళా సమాఖ్య సంఘాల నుంచి ఏర్పాటు చేసిన సిఆర్‌పిలు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి తడి చెత్త పొడి చెత్తపై అవగాహన ఎలా చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ వెయ్యి మంది జనాభాకు, ఒక పిఆర్పిని ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని, తాగునీటి పథకాన్ని పరిశీలించారు. తరువాత మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన మండల పరిషత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పిటిసి కర్రి సత్యం, మండల ప్రత్యేక అధికారి మంజుల వాణి, ఎంపీడీవో సువర్ణరాజు, పరిపాలన అధికారి డివి.లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపిడిఓ కిరణ్ వరప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, పిఆర్ జేఈ పి.సుమతి, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ విపివి.త్రినాథ్, ఏపీఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

తుపాను బాధితులకు పునరావాసం కల్పించడంలో విఫలం

ప్రజాశక్తి-మునగపాక : తుఫాను బాధితులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాదులు ఆరోపించారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాతలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా రాంబిల్లి, మునగపాక మండలాలతో పాటు పలు ప్రాంతాలలో పంట పొలాలు, ఇండ్లు ధ్వంసమైన పరిస్థితుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోర వైఫల్యం చెందిందని తెలిపారు. పునరావాస కేంద్రాలలో ఎవరూ లేరని, పునరావాసం కేంద్రాల నిధులు ఏమైనట్టు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జడ్పిటిసిలు పెంటకోట స్వామి సత్యనారాయణ, నాగరాజు, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, కిషోర్ రాజు, కాండ్రేగుల జగన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో నవంబరు ఐదో తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళకు సుమారు 15 కంపెనీలు వస్తున్నాయన్నారు. పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ఆసక్తిగల వారు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94947919350 సంప్రదించాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల : మొంథా తుఫాను కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న పునరావాసులకు గురువారం మండల స్థాయి అధికారులు, నాయకులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 30 కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసినట్లు తహశీల్దారు తిరుమల బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు, మండల అధ్యక్షులు లింగన్న నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు వేచాలపు జనార్ధన్, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాస్, టిడిపి సీనియర్ నాయకులు జానకి శ్రీను, భాస్కర్‌రావు, ఆర్‌ఐ మణికంఠ, కార్యదర్శులు రఘురాం శ్రీనివాసరావు, విఆర్‌ఓ మాణిక్యం పాల్గొన్నారు.

శారద నది ఘాట్ పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మొంథా తుపాన్ వల్ల నాలుగు రోజులుగా భారీ వర్షాల వల్ల రైవాడ జలాశయం నుండి వరద నీటిని విడుదల చేసిన నేపథ్యంలో శారద నది ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా అనకాపల్లి శారద ఘాట్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ ఘాట్‌ని అభివృద్ధి పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి, ఇతర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం నేత బాబూరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎం ఏలూరు జిల్లా పూర్వ కార్యదర్శి, ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబురావు తీవ్ర అస్వస్థతకు గురై గురువారం మృతి చెందిన నేపథ్యంలో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. సిపియం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు జి.కోటేశ్వరరావు బూబూరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ బాబూరావు తన యావత్ జీవితాన్ని సమాజసేవకే అంకితం చేశారని తెలిపారు. పీడిత ప్రజల విముక్తి కోసం, శ్రామిక వర్గ రాజ్యం కోసం కృషి చేశారన్నారు. కార్మికులు, రైతులు, చిన్న, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీవితమంతా అంకితభావంతో పనిచేశారని, కఠిన పరిస్థితులలో కూడా పార్టీ నిర్ణయాల పట్ల అవిశ్రాంత విశ్వాసాన్ని చూపారని కొనియాడారు. ఎటువంటి వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా, శ్రమజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ట్రేడ్ యూనియన్, సిపిఎం విస్తరింప చేయటంలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. నిజాయితీ, సరళత, ప్రజాప్రేమ ఆయన వ్యక్తిత్వానికి మూల స్తంభాలని పేర్కొన్నారు. ప్రజా సేవకు అంకితమైన ఆయన జీవితం యువతకు ఆదర్శం కావాలన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి, రాష్ట్ర కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న తరుణంలో ఆయన మరణం కార్మికులకు, ప్రజలకు, సిపిఎంకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, ఆర్.రాము, జి.దేముడునాయుడు, అడిగర్ల రాజు, జి.వరలక్ష్మి, సీనియర్ నాయకులు గండి నాయనబాబు, కె.ఈశ్వరరావు, పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.



బాబురావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఫార్మా పరిశ్రమలకు వెంటనే విద్యుత్ సరఫరా చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు



మాట్లాడుతున్న శంకరరావు, చిత్రంలో శ్రీను, గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : ఫార్మా పరిశ్రమలకు గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనరేటర్లపై ఫార్మా ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వెంటనే ఫార్మా పరిశ్రమలకు విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం పరవాడ సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో శంకర్రావత్ మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నిలిచిపోయిన విద్యుత్తును వెంటనే పునరుద్ధరించాలన్నారు. జనరేటర్లపై ఫార్మా ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహించడం వలన యూనిట్ విద్యుత్తు 9 రూపాయల నుండి 30 రూపాయలు ఖర్చవుతుందని, దీనికి తోడు ట్రంప్ సుంకాలు వలన ఫార్మా పరిశ్రమలు నష్టాలు పాలవుతే కొన్ని చిన్న పరిశ్రమలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన విద్యుత్తు సరఫరా లేక పరిశ్రమలు ఇబ్బంది పడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే అనేక పరిశ్రమలు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని కార్మికులకు కార్మికుల ఆవేదన గురవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి పుస్తక మహోత్సవం వాయిదా

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా ఈనెల 30 నుంచి నవంబర్ 5 వరకు జరగాల్సిన అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అనకాపల్లి పుస్తక మహోత్సవ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

హైడ్రోపై గిరిజనులను కలెక్టర్ బెదిరించడం సరికాదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్లు ఒప్పందాలకు సంబంధించిన 2, 13, 51 జిఓలను రద్దు చేయాలని కొంతకాలంగా పోరాడుతున్న ఆదివాసీలపై క్రిమినల్ కేసులు పెడతామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ బెదిరించడం సరికాదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఎఎస్ హోదాలో ఉన్న అధికారులు ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదిక పంపించి మెజార్టీ ప్రజలకు న్యాయం చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఉద్యమాలు చేస్తే కేసులు పెడతామని బెదిరించడం దారుణమన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీ గ్రామాలు, భూములు, అడవులు పర్యవరణం సహజ వనరులకు నష్టం జరగదని కలెక్టర్ గిరిజనుల ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. కలెక్టర్ గిరిజన చట్టాలకు గిరిజనులకు రక్షకునిగా ఉండాలి తప్ప నవయుగ, అదాని ప్రైవేటు సంస్థలకు సేవకునిగా ఉండరాదని హితవుపలికారు. తక్షణమే ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఇచ్చిన జిఓలను రద్దు చేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేటలో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ వసతి గృహాన్ని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గురువారం సందర్శించి వసతులను పరిశీలించారు. హాస్టల్ శిథిల స్థితికి చేరి కోవడంతో పునర్నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే హాస్టల్ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, స్థానిక 82వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

కాలువ గట్టు పటిష్టం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కొండకర్ల ఆవ ప్రధాన కాలువ తిమ్మరాజుపేట గ్రామ పరిసరాలలో వెలగా అచ్చునాయుడు పాక దగ్గర గండి పడే పరిస్థితి ఉన్న ప్రాంతంలో గురువారం సిఐ నమ్మి గణేష్, గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాబు నాయుడు ఆధ్వర్యాన యుద్ధ ప్రాతిపదికన గట్టుకు ఇసుక బస్తాలు వేసి పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆవనీటి సంఘం చైర్మన్ కాండ్రేగుల జోగినాయుడు, వెలగా అచ్చం నాయుడు, ఎల్లపు గోవిందు, ఆడారి అర్జున్, ఎస్ రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యుత్తు లైన్ల మెయింటినెన్స్, విద్యుత్తు లైనులపై చెట్లు నరకడం తదితర నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం మండలంలోని చౌడువాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య, క్లోరినేషన్ పనులు

ప్రజాశక్తి-సబ్బవరం : మొంథా తుఫాన్ కారణంగా గ్రామాలలో డ్రైనేజీలు, సిసి రోడ్లు, వీధులు చెత్తా చెదారంతో నిండి ఉండడంతో నీటి ప్రవాహంతో ముంపునకు గురైన ప్రాంతాలలో అధికారులు సూపర్ శానిటేషన్, క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీడీవో పి.పద్మజ గురువారం మండలంలోని మొగలిపురం, మల్లు నాయుడు పాలెం, గుల్లేపల్లి, గాలిభీమవరం, వంగలి, నారపాడు, బాట జంగాలపాలెం, సబ్బవరం గ్రామాలలో పర్యటించి సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు, సిసి రోడ్లు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయడం, తాగునీరు పరిశుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.



కోటవురట్ల : పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల్లో తుఫాను ప్రభావంతో పారిశుధ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రదేశాలను పరిశీలించి త్వరితగతిన వాటిని నిర్మూలించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు, మండలంలో వివిధ గ్రామాలను సందర్శించిన ఆయన చేపడుతున్న పనులను పరిశీలించారు. తాగునీటి క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

మాడుగుల : మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. గురువారం మండలంలోని వీరవిల్లి అగ్రహారం, గొట్టివాడ అగ్రహారం పాటు పలు గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య కార్మికులతో పనులు చేపట్టించాలని ఆదేశించారు. కొళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా

ప్రజాశక్తి-వడ్డాది : వరదలు కారణంగా వడ్డాదిలో ప్రజలకు స్థానిక వెంకటేశ్వర ఆర్చ్ వద్ద ఉన్న సుజల దార మినరల్ వాటర్ ప్లాంట్ నుండి ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తున్నామని పంచాయతీ ఈవో ఎంవీఎస్ లోవరాజు తెలిపారు. ఎంపీడీవో శివప్రసాద్‌తో కలిసి గురువారం స్థానిక పెద్దేరు నదీ తీరాన్ని పరిశీలించారు. పెద్దేరులో ఊట బావి పైప్లైన్ శిథిలం అవడంతో పంచాయతీ కులాయిల్లో సరఫరా అయ్యే నీరు ఎరుపు రంగులో వస్తుందన్నారు. దీనిని వాడకానికి వినియోగించుకుని తాగడానికి స్థానిక వాటర్ ప్లాంట్ నుండి రోజుకు ఒక టిన్ను నీరు ఉచితంగా తీసుకోవచ్చని ప్రజలకు సూచించారు. వరదలు తగ్గేవరకు ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తామన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



ప్రజాశక్తి -నక్కపల్లి:మొంథా తుపాన్ ఎఫెక్ట్, కార్తీక మాసం ప్రభావం కూరగాయ ధరలపై పడింది. దీంతో, ఒక్కసారిగా కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు ..అన్నట్టుగా ప్రస్తుత పరిస్థితి ఉంది. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగి పోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనే స్థితి లేక గగ్గోలు పెడుతున్నారు. కిలో 20 నుండి 30 రూపాయల మేర ధర అమాంతం పెరిగింది. తుపానుకు ముందు కిలో రూ 50,60 రూపాయలకు లభించే క్యారెట్, బీట్రూట్ ఇప్పుడు కిలో రూ. 80ల ధర పలుకుతుంది. వంకాయలు ఎన్నడూ లేని విధంగా కిలో రూ. 80 లు, దొండ కిలో రూ.60, బీర కిలో రూ.60, చేమ దుంపలు కిలో రూ.50లు, బంగాళాదుంపలు కిలో రూ 30, ఉల్లి (పెద్దవి) రూ.30, (చిన్నవి) రూ. 25, అల్లం కిలో రూ.100, మిర్చి కిలో రూ. 60ల చొప్పున మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఉల్లి, బంగాళ దుంపలు తప్ప మిగిలిన కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేసుకునేందుకు వినియోగదారులు ముందుకు రావడం లేదు. మార్కెట్లో ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.60 లు పై మాటే. ధరలు పైపైకి చేరడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనేందుకు భయపడుతున్నారు. కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తప్పని పరిస్థితుల్లో అర, పావు కేజీ చొప్పున కొనుగోలు చేసుకుంటున్నారు. చాలీ చాలనట్టుగా కూరగాయలు కొనుగోలు చేస్తున్నప్పటికీ నాలుగైదు వందలు రూపాయలు పై మాటే ఖర్చు అవుతుందని వినియోగదారులు వాపోతున్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వై.ఎస్సార్. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని గురువారం గొలుగొండ, నాతవరం మండలాల్లో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణతో విద్యార్థులు, ప్రజలకు నష్టం కలుగుతుందని వివరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటు చేతుల్లోకి వెళితే పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యంపైన భారం పెరుగుతుందన్నారు.ఈ సంతకాలను గవర్నర్‌కు పంపనున్నట్లు గణేష్ చెప్పారు.ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి 800 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలోని జాలంపల్లి పంచాయతీ శివారు రాయిపాలెం వద్ద నున్న పెద్దేరు జలాశయంలో కురుస్తున్న వర్షాలు కారణంగా భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని మొత్తం నీటి మట్టం 137 మీటర్లు కాగా జలాశయంలోకి ఎనిమిది వందల క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. ప్రస్తుతం నీటి మట్టం 134.60మీటర్లు ఉందని జలాశయం పర్యవేక్షణ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. దీంతో 800 క్యూసెక్కులు నీటిని స్పిల్వే గేట్లు ద్వారా విడుదల చేయడం జరిగిందన్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రాజయ్యపేటలో తనతోపాటు గ్రామ సర్వేయర్, మహిళా పోలీస్ పై పలువురు దౌర్జన్యం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కాకర సత్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మండల ప్రత్యేక అధికారి విజయ, తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్యపేట పంచాయతీ కార్యదర్శి సత్యం మాట్లాడుతూ,పునరావాస కేంద్రంలో 28న మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిపై గ్రామానికి చెందిన పలువురు బుధవారం సచివాలయానికి వచ్చి ఏదో న్యూస్‌లో వచ్చిందని గ్రామస్తులు అందరికీ భోజనాలు ఎందుకు పెట్టలేదని, దండోరా ఎందుకు వేయలేదని తనతోపాటు సర్వేయర్, మహిళా పోలీస్‌లపై దౌర్జన్యం చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఆ న్యూస్ కు సంబంధించి ప్రామాణికం కాదని, అందరికీ భోజనాలు పెట్టలేదని, ఎంతమందికి భోజనాలు పెట్టామో వివరాలు తెలియజేస్తానని చెప్పినప్పటికీ తమపై దురుసుగా ప్రవర్తించాలని తెలిపారు.పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ మేరకు సీఐ మురళి మాట్లాడుతూ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆలయానికి రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన కొర్ని శంకర్రావు కొండమ్మ దంపతలు కుమార్తె ఆర్తి కుమారి ఆలయానికి రూ. 25 నగదును గురువారం ఆలయ కమిటీ చైర్మన్ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రవణబాబు, టిడిపి నాయకుడు మజ్జి విశ్వనాథం, వానపల్లి వేణు, పోతిన జగదీష్, వద్దాది గణేష్, పోలిపల్లి కృష్ణ, రాయపురెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న దాతలు

తుపాన్ ప్రాంతాల్లో అధికారులు, నాయకుల పర్యటన

ప్రజాశక్తి-గొలుగొండ:తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు లింగంపేట పంచాయతీలో గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపైనే నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. గ్రామంలో ఇళ్ల మధ్య భారీగా నీరు చేరింది.పంచాయతీలో సరైన డ్రైనేజీ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని మహిళలు వాపోతున్నారు.

మాడుగుల:మొందా తుఫాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పొంగలిపాక, పి.శివరాంపురం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్, కింతలి పిఏసిఎస్ అధ్యక్షులు ఉండూరు దేముడు గురువారం పరిశీలించారు. జనసేన నాయకులు పచ్చికొర నాగు, కోన నల్లన్న, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:మొంథా తుఫాను వర్ష ప్రభావానికి చెరువు గట్టు కోతకు గురి కావడంతో దిగువన వరి పొలాలు ముంపునకు గురైనట్లు సర్పంచ్ సూరి నాయుడు తెలిపారు. చీడికాడ మండలం జి.కొత్తపల్లి పంచాయతీ చిన్నగోగాడ గ్రామంలో గొల్లవాని బంద చెరువు గట్టు కోతకు గురవడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. అధికారులకు తెలియజేశామని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పి గోపి తెలిపారు.

కొత్తకోట, రోలుగుంట:తుఫాన్ కారణంగా పంటలను కోల్పోయిన గిరిజన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె. గోవిందరావు డిమాండ్ చేసారు. గురువారం ఆయన రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారు సోంపురం బంధలు, నేరేడు బంధ, పిత్రి గడ్డ,నీళ్లు బంద గ్రామాలతో పాటు రోలుగుంట మండలం అర్ల గ్రామాలలో తుఫాన్ తో నష్ట పోయిన గిరిజనులకు (పివిటిజీ తెగకు) చెందిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గోవింద రావు మాట్లాడుతూ, కష్ట పడి పండించిన పంట చేతికి అందే సమయానికి భారీ వర్షాలకు నేల కొరిగి భారీగా పోయిందని, దీంతో ఆయా గిరిజనులు అవస్థలు పడుతారన్నారు. సుమారు 10 ఎకరాలలో పండించిన సోడి, మెట్టు ధాన్యం ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. అనంతరం పంట నష్ట పోయిన గిరిజన రైతులను పరామర్శించారు...

కశింకోట : అనకాపల్లి, కశింకోట మండలాల పరిధిలోని శారద నది గట్లు పటిష్టకు చర్యలు తీసుకుంటామని స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తేగాడ, వెదురుపర్తి గ్రామాల్లో శారదా నది పరివాహక ప్రాంతాన్ని గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నేతలు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిని రమణమూర్తి, కర్రి సత్య నారాయణ, బుదిరెడ్డి గంగయ్య, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శారద నది ఒడ్డున ఉన్న గృహదారులకు నెంబర్-1 పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గురువారం సందర్శించి వారితో మాట్లాడారు.

చోడవరం : చోడవరం పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు గురువారం పర్యటించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ ఈవో కే శ్రీనివాసరావు, సర్పంచ్ బండి నూకాలమ్మ, ఎంపిటిసి కె రూపాదేవి పాల్గొన్నారు.

అనకాపల్లి : తుఫాన్ తాకిడికి నేలమట్టమైన వరి పొలాలను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలించారు. శంకరం, వెంకుపాలెం జోగారావుపేట గ్రామాల్లో నీట మునిగిన పొలాలను పరిశీలించి అధికారులతో మాట్లాడి దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం ఇప్పిస్తామని తెలిపారు.

అనకాపల్లి రూరల్ : భారీ వర్షాల వల్ల కొత్తూరు పంచాయతీ రైల్వే అండర్ బ్రిడ్జి దేవినగర్ వద్ద దొంగగెడ్డ నుండి భారీ ప్రవాహం రావడంతో ప్రజలకు ఇబ్బంది కలిగిందని మాజీ శాసన మండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ నేతలతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సత్యనారాయణపురం మూలపేట గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సర్పంచ్ సప్పరపు ప్రసన్న లక్ష్మి, టిడిపి నేతలు మేడిశెట్టి సత్తిబాబు, బర్ల నాగరాజు, కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం సరిపల్లి ప్రాంతాల్లో తహసిల్దార్ బి.చిన్నికృష్ణ తమ సిబ్బందితో పర్యటించి పరిశీలించారు. పెచ్చెట్టి వారి చేనులు దగ్గర గెడ్డవాగు నీరు ప్రవాహం ఉధృతం కావడంతో పెచ్చెట్టి మహాలక్ష్మి నాయుడు ఇళ్లకు రాకపోకలకు నాలుగు రోజులుగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసిల్దార్, సీఐ జి.రామచంద్రరావు పరిశీలించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది, విజయరామరాజుపేట వంతెనలను, నీట మునిగిన పంట పొలాలను గురువారం వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ పరిశీలించారు. బిఎన్ రోడ్, తాచేరు వంతెనల నిర్మాణం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. 3 నెలల్లో 2 సార్లు తాచేరు వంతెన కొట్టుకుపోయిందని తెలిపారు.

యలమంచిలి టౌన్ : మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం, కట్టుపాలెం గ్రామాలలో మైనర్ శారద ముంపు ప్రాంతాలలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి పర్యటించారు. నాయకులు గొర్లి నానాజీ, ఆడారి అదిమూర్తి, కర్రి యూన్సీ, ఆడారి రమణబాబు,ఎల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్టు తొలగింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నుండి తుని రోడ్డులోని కృష్ణాపురం వద్ద రహదారి పక్కన ఉన్న మామిడి చెట్టును నాతవరం పోలీస్ స్టేషన్ ఎస్సై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో తొలగించారు. దీర్ఘకాలం నుండి రహదారి పక్కన ఉన్న ఆ చెట్టు కారణంగా వాహనాలకు అడ్డంకి ఏర్పడుతూ, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయంలో వాహనదారులకు చెట్టు కొమ్మలు కనిపించక పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో చెట్టును తొలగించారు.



చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్యశిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సాలిక మల్లవరం గ్రామంలో గొలుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాలతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమ తెరలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకరత్నం, ఎంపీహెచ్‌పి సాయిమణి, సూపర్‌వైజర్ నాయుడు, హెచ్‌వి అరుణ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో సరుకులు ఇస్తున్న నేతలు

బాధితులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మొంథా తుఫాన్ బాధితులకు నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో గురువారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి అనంతరం నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, నాతవరం మండల అధ్యక్షులు వెలగ వెంకటరమణ, సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాస్, నాతవరం మండల ఉపాధ్యక్షులు గుడివాడ అసేన్ కుమార్, నరసింహ, రెడ్డి నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:తుపాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రంలో ఉన్న గొలుగొండ మండలం దొంకాడ గ్రామానికి చెందిన గిరిజనులకు గురువారం నిత్యావసర సరుకులను మండల టీడీపీ అధ్యక్షులు చిటికెల తారక వేణుగోపాల్, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ రామారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

గొలుగొండ:మొంథా తుపాన్ ప్రభావంతో గొలుగొండ మండలం కసిమి పంచాయతీలో కూలీ పనులు చేసుకునే వారు ప్రస్తుతం అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామ టీడీపీ అధ్యక్షులు కవల మహేష్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎం హెచ్ఓ

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. రెండవ వైద్యాధికారి ఉదయకుమార్ తరచూ విధులకు హాజరు కాక పోవడం పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆయన పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మరో వైద్యాధికారిణి సురేఖ తో పాటు స్థానిక సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాలలో ఐరిస్క్ గర్భవతులను ఎక్కడ ఉన్నా తక్షణమే ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. వారికీ కావాల్సిన సదుపాయాలు సమాకూర్చాలన్నారు. తుఫాన్ ప్రభావంతో ఎక్కడైనా అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పారి శుధ్య నివారణకు పంచాయతీ అధికార్లతో సమన్వయం చేసుకొని క్లోరినేషన్ చేయించాలని ఆమె తెలిపారు. వ్యక్తి గత పరి శుభ్రత పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసారు పలువురు గర్భిణీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట వైద్యాధికారి సురేఖ ఉన్నారు.

'అవంతి'కి పురస్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం: మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు బ్రెయిన్ ఓ విసివన్ సొల్యూషన్ ప్రైవేటు సంస్థ నిర్వహించిన భారత ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు 2025గాను విద్యలో సమగ్ర ప్రతిభా పురస్కారం అందు కున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు, ఈ ప్రతిష్టాత్మక అవార్డు ఇంజనీరింగ్ విద్యా రంగంలో కళాశాల చూపించిన పరిశోధన నాణ్యమైన విద్యలో కృషిని గుర్తిస్తూ ప్రధానం చేసినట్లు ఈ సందర్భంగా ఆయన అన్నారు, అదేవిధంగా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాసరావు ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులను ప్రముఖ వ్యాపార సంస్థలు ఉపాధి కల్పించినందుకు గాను శ్రద్ధ ఆచార్య అవార్డు అందుకున్నట్లు తెలిపారు, ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆయనను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్



సమస్యలపై ప్రశ్నిస్తున్న బుల్లిదొర

రోడ్లను ఎవరూ పట్టించుకోరా ?

-మున్సిపల్ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపల్ చైర్మన్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం జరిగిన మున్సిపల్ సమావేశం లో ప్రధానంగా పలువురు సభ్యులు నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ ఎవరూ పట్టించుకోరా అంటూ ప్రశ్నించారు. బలిఘట్టం, పెద్ద బొడ్డేపల్లి, నర్సీపట్నం ప్రధాన రహదారి, చింతపల్లి వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతిన్నాయని కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నా ఎవరు పట్టించుకోరా అంటూ 15వ వార్డు సభ్యులు బుల్లిదొర సహా పలువురు నాయకులు అధికారులను నిలదీశారు. దీనిపై స్పందించిన కమిషనర్ సురేంద్ర దెబ్బతిన్న రోడ్లన్నీ ఆర్ అండ్ బి పరిధిలో ఉన్నాయని, వాటికి మున్సిపల్ నిధులు ఎలా కేటాయిస్తామంటూ సభ్యులకు తెలిపారు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

బల్క్ డ్రగ్‌ను రద్దు చేసే వరకూ పోరాటం

కొనసాగిన మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-నక్కపల్లి : తమ జీవన విధానాన్ని, ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్‌ను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు గురువారం నాటికి 47వ రోజుకు చేరుకుంది. ఎన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ మత్స్యకారులు బల్క్ డ్రగ్ పై అలుపెరగని పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. తుఫాన్ కారణంగా టెంటు చిరిగిపోవడం, వర్షానికి శిబిరం వద్ద బురదమయంగా మారడంతో, మత్స్యకారులు నిలబడే తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. మత్స్యకారుల చేపట్టిన ఉద్యమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసం మాట్లాడుతూ, మత్స్యకారులు 47 రోజుల నుండి బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నప్పటికీ నేటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మత్స్యకారులకు చేపలు వేట తప్ప మరో వృత్తి తెలియదని, సముద్రాన్ని కలుషితం చేసి వారి పొట్ట కొట్టొద్దన్నారు. మత్స్యకారుల ఆందోళనకు వైసిపి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గోవింద్, మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

వస్త్ర వ్యాపారంలో రారాజు చందన మోహనరావు

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : వస్త్ర వ్యాపారంలో చందన మోహనరావు రారాజు వంటివారిని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. చందన బ్రదర్స్ వ్యవస్థాపకుడు, వస్త్ర, బంగారం వ్యాపారంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో గుర్తింపు పొందిన చందన మోహనరావు సంస్మరణ సభ గురువారం దసపల్లా హోటల్లో జరిగింది. సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ దాదాపు ఐదు దశాబ్దాల పాటు నాలుగు రాష్ట్రాలలో 45కుపైగా బ్రాంచిలను తెరిచి ఎంతోమందికి ఉపాధి కల్పించిన మహానుభావుడు చందన మోహనరావు జనం మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలను అల్లుడు, సిఎంఆర్ స్థాపకులు మావూరి వెంకటరమణ కొనసాగించాలని ఆకాంక్షించారు. హాల్‌మార్క్ బంగారంతో పాటు పలు రకాల స్కీంలతో వినియోగదారులను ఆకట్టుకున్న చందన మోహనరావు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మావూరి వెంకటరమణ, కుటుంబ సభ్యులతో కలిసి చందన మోహనరావు చిత్రపటానికి స్పీకర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, ప్రభుత్వ విప్ పి.గణబాబు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కంకటాల మల్లిక్, మావూరి బాలాజీ, తాళ్లూరి పూర్ణచంద్రరావు, తుమ్మిడి బాబీ, పేర్ల సాంబమూర్తి తదితరులు పాల్గొని చందన మోహనరావు సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు.



నివాళి అర్పిస్తున్న స్పీకర్, ఎమ్మెల్యేలు, నాయకులు



పర్యవేక్షిస్తున్న అధికారులు

వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్

ప్రజాశక్తి -నక్కపల్లి: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి ప్రజలు రోగాల బారిన పడకుండా వాటర్ ట్యాంకుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. మండలంలో సిహెచ్ లక్ష్మీపురంలో గురువారం పర్యటించారు. మురుగు కాలువలో పూడిక తీత పనులను పర్యవేక్షించారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన సిపిఎం, రైతు సంఘం నేతలు



ముంపునకు గురైన యాదగిరిపాలేన్ని పరిశీలిస్తున్న రైతు నేతలు

ప్రజాశక్తి-మునగపాక : మొంథా తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయనబాబు డిమాండ్ చేశారు. మండలంలోని యాదగిరి పాలెం, చూచుకొండ, గణపర్తి, ఆనందపురం తదితర గ్రామాలలో గురువారం వారు పర్యటించారు. తుఫాన్ కారణంగా నేల కొరిగిన చెరకు పంటలను, నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అత్యధికంగా ఉన్న పాడి రైతులకు వర్షాల కారణంగా పశు గ్రాసం కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలని, ఉచితంగా పశుదాణా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా సన్న, చిన్నకారు రైతులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం వారికి నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని కోరారు. చూచుకొండ- గణపర్తి గ్రామాల మధ్య ఉండే బ్రిడ్జి ఎత్తు పెంచి నిర్మాణం చేపట్టాలన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన పంట భూములను అధికారులు సందర్శించి రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన చెరకు రైతులకు ఎకరాకు రూ.50 వేలు, వరి రైతులకు రు.25 వేలు పంట నష్టపరిహారాన్ని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, నాయకులు కూంద్రపు సోమునాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ, కాంగ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తుఫాన్ కారణంగా మునిగిపోయిన వరి పంటకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీ పాలెం జగ్గంపేట గ్రామాలలో గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము, సిఐటియు మండల కన్వీనర్ కె.సోము నాయుడు, ఎస్ బ్రహ్మాజీ తదితరులు పర్యటించారు. నడుము లోతు నీటిలో దిగి మునిగిన వరి పంటను పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులతో పంట పొలాలను సర్వే చేయించి పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాడి నూకరాజు, మల్ల రమణ, మల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న సిపిఎం, రైతు నాయకులు

గిరిజనులకు నిత్యావసర సరుకుల అందించాలి

దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయతీ శివారు బొర్రచింత గ్రామంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో 13 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. భారీ వర్షాలకు బొడ్డు ఏరు లింకు ఏరు దాటాలంటే బొర్రచింత గిరిజన గ్రామ ప్రజల భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. నిత్యవసర సరుకులు తెచ్చుకోవాలన్న ఏరు దాటాలని పేర్కొన్నారు. వారం రోజులుగా ఉపాధి లేకుండా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ గ్రామ గిరిజనులందరికీ 35 కేజీల చొప్పున బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

అందని రేషన్ : ఐద్వా, సిఐటియు

కశింకోట : తుపాన్ దృష్ట్యా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో రేషన్ డిపోల ద్వారా నవంబర్ నెల రేషన్ మంగళవారం నుంచే అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటించినా కశింకోటలో రేషన్ డిపోల ద్వారా ఐదు కేజీల చొప్పున మాత్రమే బియ్యం ఇస్తున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ముందస్తుగా రేషన్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ వలన కార్మికులు, పేదలు పనులు కోల్పోయారని, వారిని ఆదుకోవాలని కోరారు.



గెడ్డ దాటి బొర్రచింత గ్రామానికి వెళ్తున్న గిరిజన సంఘం నేత